క్లుప్తంగా

వల్లివేడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



000

పాకాల: మండలంలోని వల్లివేడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహ వ్యవస్థాపకులు జి.సుబ్రమణ్యం(లేట్), ఎ.గోవిందు, టి.పరదేశి, బాబు సహకారంతో పీఎస్ఎన్.మూర్తి, ఎస్ సిద్ధోజి రావు చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పలువురు దళిత నేతలు మాట్లాడా రు. వెనుకబడిన కులస్తులందరూ ఉన్నత విద్య ను అభ్యసించినప్పుడే జాతికి విలువ వస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీఓ మైక్రో ఇరిగేషన్ ఏ.కృష్ణమూర్తి, జయరామయ్య, ఆంజనేయులు, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చంద్రగిరి: మండలంలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లెలో ఆదివారం తిరుపతిలోని నరేంద్ర హాస్పిటల్, ఎస్వీ జూ పార్క్ మాజీ డైరెక్టర్ మణియాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి మంచి స్పందన లభించింది. శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. తీవ్రమైన సమస్యలు ఉన్న వారిని నరేంద్ర ఆసుపత్రికి తీసుకెళ్లి ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందిస్తామని వైద్యులు తెలిపారు. తమ గ్రామంలో ప్రతి ఏటా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మణియాదవ్ చెప్పారు. శిబిరంలో వైస్ ఎంపీపీ బొజ్జా వెంకటరత్నం, వైద్య శిబిరం నిర్వాహకులు పానేటి చెంగల్రాయులు, నరేంద్ర హాస్పిటల్ డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మౌనిక, శ్రీకాంత్, పీఆర్ఓ పురుషోత్తం పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు

తిరుపతి తుడా: స్థానిక ఓ ప్రైవేటు సంస్థ సమావేశ మందిరంలో రాష్ట్ర పల్మనాలజీ సదస్సులో భాగంగా ఆదివారం ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధులు, నియంత్రణ, ఆధునిక వైద్యం అనే అంశంపై వైద్య నిపుణులు చర్చించారు. వర్క్‌షాపులో పలువురు వైద్యులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ శుభాకర్, డాక్టర్ రఘు, డాక్టర్ బాల సుబ్రమణ్యమ్, వైద్యులు పాల్గొన్నారు

జీవకోనలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు



ఔట్ పోస్టును ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ,ఎమ్మెల్యే

తిరుపతి క్రైం /తిరుపతి మంగళం : నగరంలోని జీవకోనలో జీవలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పోలీస్ ఔట్ పోస్టను ఆదివారం పోలీస్ ఔట్ పోస్టును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో 45 వేల మంది జనాభా కలిగి ఉండడంతో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఈ ఔట్ పోస్టను పునఃప్రారంభించినట్లు ఎస్పీ చెప్పారు. దీనిని ఫారెస్ట్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఆరు డివిజన్లతో కలిపి 125 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్పీ చెప్పారు. ఈ ప్రాంతంలో చాలావరకు వలస కార్మికులు నివసిస్తున్నారని, ఇక్కడ వివిధ సాంప్రదాయాలు కలిగిన ప్రజలు కూడా ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో చెక్ పెట్టే దిశగా ఇప్పటికే డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచామన్నారు. కార్యక్రమంలో తిరుపతి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్, ఏఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ భక్తవత్సలం, పోలీస్ సిబ్బంది.. సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరుపతి : 99516 02971

చంద్రగిరి : 95055 17845

బస్టాండ్ తొలగింపు పనులకు బ్రేక్

- మల్టీ మోడల్ బస్టాండ్‌కు టెండర్లు పూర్తి



ఇటీవల తొలగించిన బస్టాండ్ పిట్టగోడ , బస్టాండ్‌లో నిలుపుదల చేసిన పనులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి బస్టాండ్‌లోని మొదటి ఐదు ప్లాట్ ఫాంలను తొలగించడానికి బ్రేక్ పడింది. నాలుగు రోజులుగా తొలగింపు పనులను అధికారులు నిలుపుదల చేశారు. తొలగింపునకు రూ.14 లక్షలు, తిరిగి రేకులతో నిర్మించడానికి రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఆ దిశగా అధికారులు తొలగింపు పనులకు పూనుకున్నారు. దశల వారీగా శ్రీహరి బస్టాండ్‌లోని 22 ప్లాట్‌ఫాంలను తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందుగా పై భాగంలోని పిట్టగోడను వారం క్రితం తొలగించారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను మల్టీ మోడల్ బస్టాండ్‌గా సకల సౌకర్యాలతో 14 అంతస్థులు నిర్మించడానికి కేంద్ర సహకారంతో రూ.500 కోట్లు కేటాయింపులు చేసిన సంగతి తెలిసిందే. ఆ మేరకు కేంద్ర బృందం పలుసార్లు తిరుపతి బస్టాండ్‌లో భూపటుత్వ పరీక్షలు నిర్వహించింది. అయితే ఆ తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీనిపై దృష్టి సారించలేదు. దీంతో శిథిలావస్థకు చేరుకున్న తిరుపతి శ్రీహరి బస్టాండ్‌ను దశల వారీగా తొలగించి..తాత్కాలికంగా రేకుల షెడ్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఐదు రోజుల క్రితం మల్టీ మోడల్ బస్టాండ్‌కు ఢిల్లీలో టెండర్లు పూర్తి చేశారు. దీంతో బస్టాండ్ మొత్తాన్ని తొలగించి నూతనంగా మల్టీ మోడల్ బస్టాండ్‌ను నిర్మిస్తారనే చర్చకు తావిచ్చింది. ఈ క్రమంలో శ్రీహరి బస్టాండ్‌లోని మొదటి ఐదు ప్లాట్‌ఫాంల తొలగింపు పనులు నిలుపుదల చేశారు. అయితే గతంలో బస్టాండ్‌కు ఇచ్చిన డిజైన్లు కాకుండా కొత్తగా డిజైన్లు ఏర్పాటు చేస్తారని ఊహాగానాలు రేగుతున్నాయి. కొత్త డిజైన్లు తయారు చేసే ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంటే మళ్లీ తొలగింపు పనులు చేస్తారా...లేదా? అనే దానిపై విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తం రెండు మూడు రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

– కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



శ్రీవారి ఆలయం వెలుపల రవీంద్రనాథ్ రెడ్డి

తిరుమల: అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజల కూటమి ప్రభుత్వానికి మోసం చేసిందని కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శనానంతరం ఆయనన ఆలయం వెలుపల మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అన్నదాతల గిట్టుబాటు ధరల్లేక పంటలు నష్టపోతున్నా ఆదుకున్న పాపానపోవడం లేదని మండిపడ్డారు. రైతుల కష్టాలు, ప్రజల సమస్యలు తీర్చేలా దారి చూపాలని, 2029 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి ప్రజలకు మంచిరోజులు వచ్చేలా ఆశీర్వదించాలని స్వామి వారిని మొక్కినట్టు చెప్పారు. ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు సానుకూలంగా ఉన్నారని, 12న తమ పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని జోస్యం చెప్పారు. కక్షపూరితంగా తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి ఓటింగ్‌కు రాకుండా చేయాలని కూటమి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా ఓట్లను తారుమారు చేసి పోలింగ్ బూత్‌లను ఐదు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారని ఆక్షేపించారు. ఇలా చేయడానికి బదులు జెడ్పీటీసీ అభ్యర్థులను వాళ్లే నామినేట్ చేసుకుని ఉంటే పోయేదని వ్యంగ్యంగా అన్నారు.

చెత్తకుప్పలు తొలగించారు

- అభినయ్‌రెడ్డి నిరసనతో అధికారుల్లో చలనం

తిరుపతి మంగళం: తిరుపతి సుందరయ్యనగర్‌లో గుట్టలు...గుట్టలుగా పడి ఉన్న చెత్త కుప్పలపై వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంతో కార్పొరేషన్ అధికారుల్లో చలనం వచ్చింది. దీంతో ఆదివారం తెల్లవారే సరికి ఉరుకులు పరుగులపై కార్పొరేషన్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది సుందరయ్యనగర్‌కి వచ్చి అక్కడి చెత్తకుప్పలను తొలగించారు. అలాగే ఆ ప్రాంతమంతా బ్లీచింగ్ చల్లారు. ప్రజారోగ్యంపై ఆందోళన చేసే పరిస్థితి తేకుండా కార్పొరేషన్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని భూమన అభినయ్‌రెడ్డి హితవు పలికారు.

శంకరంబాడికి ఘన నివాళి



శంకరంబాడికి నివాళులు అర్పిస్తున్న పలు సాహితీ సంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్/తిరుపతి అన్నమయ్య సర్కిల్: 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' రాష్ట్ర గీత రచనతో తెలుగు జాతీయ ఖ్యాతిని చాటిన ప్రసన్న కవి శంకరంబాడి సుందరాచారి జయంతి సందర్భంగా లక్ష్మీపురం సర్కిల్లోని శంకరంబాడి విగ్రహానికి ఆదివారం పలువురు సాహితీ వేత్తలు, వేమన విజ్ఞాన కేంద్రంప్రతినిధులు, రాయలసీమ రంగస్థలి కళాకారులు ఘన నివాళులు అర్పించారు. శంకరంబాడి సాహితీ పీఠం అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ ఆధ్వర్యంలో గీతాపాలన చేస్తూ పుష్పాంజలి ఘటించారు. జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున,రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడారు. తిరుపతి నేలపై అన్నమయ్య, శంకరంబాడి మహనీయులు నడయాడారని, శంకరంబాడి రాసిన మా తెలుగు తల్లి గీతం జాతి జనుల జాతీయగీతమై తిరుపతికి ఖ్యాతి చేకూర్చిందని కీర్తించారు. ప్రముఖ రచయిత్రి ఎం.అరుణకుమారి, శంకరంబాడి సాహితీ పీఠం అధ్యక్షురాలు మాట్లాడుతూ, శంకరంబాడి జయంతిని ప్రతి ఏటా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని, అలాగే శంకరంబాడి పేరిట సాహితీ పురస్కారాలు ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో సాహితీ సంస్థల ప్రతినిధులు మన్నవ గంగాధరప్రసాద్, తమటం రామచంద్రా రెడ్డి, యువశ్రీ మురళి, ఏనుగు అంకమ నాయుడు, వాకా ప్రసాద్, మల్లారపు నాగార్జున, మల్లేశ్వర రావు, సహదేవ నాయుడు, కసిరెడ్డి లలితమ్మ, డాక్టర్ నరసింహులు, టెంకాయల దామోదరం, ధర్మయ్య, సాకం ప్రభాకర్, షరీఫ్, నాగయ్య, సాకం కృష్ణమూర్తి, ఏడుకొండలయ్య, వేమన విజ్ఞానకేంద్రం నాయకులు పంచముఖేశ్వర్ రావు, గురునాథం, బాలాజీ చౌదరి, రెడ్డెప్ప, రఫీ, రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, కళాకారులు పొన్నాల జేజిరెడ్డి, మురళీకృష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్, అన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

అరుణమ్మకు భూమన అభినయ్ నివాళి



నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ పాలకమండలి సభ్యుడు, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి మాతృమూర్తి గుడిపల్లి అరుణమ్మ ఆదివారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి భానుప్రకాష్ రెడ్డి నివాసానికి వెళ్లి అరుణమ్మ భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భానుప్రకాష్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అభినయ్‌తో పాటు పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ నాయకులు భాగ్యనగరం శేఖర్‌రెడ్డి, తుడా వెంకటరెడ్డి, పసుపులేటి సురేష్‌రాయల్, సుదీర్, సతీష్ తదితరులు నివాళులు అర్పించారు.

నేడు విద్యార్థి సంఘాల నిరసన

తిరుపతి సిటీ: విద్యార్థి సంఘాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో జిల్లాలోని సుమారు 12 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి టౌన్‌క్లబ్ వద్ద నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేయనున్నట్టు సంఘాల నేతలు తెలిపారు.

సమస్యలకు పరిష్కారం భగవద్గీత



నృత్య ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినులు

- అలరించిన 'కృష్ణం వందే జగద్గురు'
- నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

తిరుపతి సిటీ: మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపేది భగవద్గీత మాత్రమేనని సుప్రసిద్ధ జ్యోతిష్య విద్వాంసులు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ, శ్రీ అన్నమయ్య నృత్య అకాడమీ, అపుస్మా సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో ఆదివారం 'కృష్ణం వందే జగద్గురు' కార్యక్రమాన్ని వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సరిపెల్ల.. కృష్ణం వందే జగద్గురు థీమ్ గురించి మాట్లాడారు. భగవద్గీత మానవ జీవితానికి ప్రసాదించిన గొప్పనిధి అని, ప్రతి కుటుంబం గీతా పఠనం చేయాలని కోరారు. సంస్కృత అధ్యయనం చేస్తే గీతాసారాంశం అవగతమవుతుందన్నారు. అనంతరం నగరంలోని పలు పాఠశాలల విద్యార్థినులు శ్రీకృష్ణుని నృత్యం, గీతా పారాయణం, గీతా సారాంశాన్ని నృత్య ప్రదర్శన చేసి వీక్షకులను అలరించారు. అన ంతరం అతిథుల చేతుల మీదుగా నిర్వాహకులకు నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సాంబశివమూర్తి, డీన్ రజనీకాంత్ శుక్లా, నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ మలేషియా ఆంధ్రప్రదేశ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి, వాగ్వర్ధిని పరిషత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ భరత్ భూషణ్ రథ్, నిర్వాహకులు డాక్టర్ శ్రీరామ్‌బాబు, నోడల్ ఆఫీసర్‌గా అధ్యాపకులు డాక్టర్ కనపాల కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అద్దెకు తీసుకున్నాం..

– వారి సొంత వ్యవహారంతో నిందలు

తిరుపతి కల్చరల్: వ్యాయామశాల ఏర్పాటు కోసం అమెరికాలోనున్న తులసీరామన్ నుంచి మంగళం సప్తగిరి కాలనీలోని ఆయన భవనాన్ని అద్దెకు తీసుకున్నామని, అయితే తులసీరామన్ తమ్ముడు నరేంద్ర, భాగస్వామి రామి రాయ్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా తాము దాడులు చేశామని నిందారోపణలు చేస్తున్నారని లీజుదారుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తులసీరామన్‌కు చెందిన మంగళం రోడ్డులోని ఓ కమర్షియల్ బిల్డింగ్‌ను అధికారికంగా గత జూలై 1న లీజు అగ్రిమెంట్ పొందామని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ బిల్డింగ్ లీజుతో జీపీఏ హోల్డర్‌గా ఉన్న తులసీరామన్ తమ్ముడు నరేంద్ర వారి వ్యాపార భాగస్వామి రామిరాయ్‌రెడ్డితో కలిసి కోవర్క్ స్టార్టప్ కంపెనీ కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలిపారు. బిల్డింగ్ యజమాని బిల్డింగ్ ఖాళీ చేయాలని చెప్పి వారి జీపీఏ రద్దు చేసినా భవనం ఖాళీ చేయక వారు కాలయాపన చేశారని తెలిపారు. ఆ బిల్డింగ్ తాము అద్దెకు తీసుకున్నామని, దీనిని తమకు ఇవ్వాలని కోరామని, అయితే శనివారం వారే ఉద్దేశపూర్వకంగా కార్యాలయంలో లక్షల విలువ చేసే ఫర్నీచర్ ధ్వంసం చేసి, తమపై నిందలు మోపడం సరికాదన్నారు. సమావేశంలో భాగస్వామి నాని పాల్గొన్నారు.

కార్యాలయం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోవర్క్ స్టార్టప్ కంపెనీ స్థాపన కోసం తులసీరామన్ కమర్షియల్ బిల్డింగ్ అద్దెకు తీసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నామని ఆ కంపెనీ నిర్వాహకులు రామి రాయ్‌రెడ్డి, నరేంద్ర తెలిపారు. బిల్డింగ్ లీజు అగ్రిమెంట్ 2029 వరకు ఉన్నా తులసీరామన్ ఖాళీ చేయాలని కోరారని, తమకు గడువు ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా శనివారం తన అనుచరులతో తమ కంపెనీ కార్యాలయం తాళాలు పగుగొట్టి లక్షలాది రూపాయల విలువైన ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో స్టార్టప్ కంపెనీ పార్టనర్ నరేంద్ర పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

తిరుపతి కల్చరల్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లకుప్పం శేఖర్‌కు బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆదివారం ఆత్మీయ సత్కారంతో అభినందించారు. యూనియన్ వ్యవస్థాపకుడు తంగవేలు మాట్లాడుతూ, తమ యూనియన్ అధ్యక్షుడైన మల్లకుప్పం శేఖర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో సత్కరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అల్లాబక్ష్, రమణ, జగన్నాథం, మధు యాదవ్, సాయిప్రసాద్, దీన దయాల్‌నాయుడు, మునిరాజ, కృష్ణమూర్తి, వెంకటరమణ, చెంగల్‌రాయులు, హరి, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఉత్తరప్రదేశ్ మంత్రి సునీల్ బరాల దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.


నోటీస్ బోర్డు

- స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఉదయం 10 గంటలకు ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద వామపక్ష, ప్రజాసంఘాల ధర్నా.
- కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ప్రజా పరిష్కార వేదిక.
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్.
- కంచిమఠంలో ఉదయం 10.30 గంటలకు దివ్యాంగులకు ఆర్టిఫిషియల్ లిబ్స్, వీల్ చైర్స్ పంపిణీ.

మురుగు భరించలేం..!

తిరుపతి తుడా: తిరుపతిలో వర్షపు, మురుగునీరు నగరం దాటడం లేదు. రోడ్లపై ప్రవహించే నీరు కాలువల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా చేయడంతో పలు ప్రాంతాల్లో దుస్థితి నెలకొంది. ఫలితంగా ప్రజల రాకపోకలు, రవాణా మురుగు కష్టాల నడుమ సాగుతోంది. రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా కాలువల్లోకి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుని నగర ప్రజానీకం కోరుతోంది.

నృత్య సమ్మోహనం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం అరక్కోణంకు చెందిన యుగాస్ మ్యూజిక్ అండ్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు పాటలకు చిన్నారులు హరిప్రియ, మధుమిత, తనుశ్రీ, దక్షిత, దయశ్రీ, హరిప్రియ, రాజశ్రీ, ప్రియదర్శిని, లేఖ, యుగవరసి, కావ్య, రక్ష, మనీషా తమ నృత్యంతో సమ్మోహితుల్ని చేశారు. అనంతరం ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

దహనక్రియలు



కీ॥శే॥ శ్రీమతి గుడుపల్లి అరుణమ్మ గారు
(భర్త లేట్ శ్రీ గుడుపల్లి రామక్రిష్ణా రెడ్డి)
జననం 26-04-1945
మరణం 10-08-2025
కుటుంబ అభ్యున్నతికి మీరు చేసిన కృషి అసమాన్యం ...
మీరు పంచిన ప్రేమానురాగాలు, సేవానిరతి ఎన్నటికీ మరువలేనివి ...
మీరు లేని లోటు ఎన్నటికి తీరనిది, మీ మధురస్మృతులను స్మరించుకుంటూ ...
మీ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుకుంటూ ... భాష్పాంజలి ఘటిస్తున్నాము.
వీరి దహనక్రియలు 11-08-2025వ తేది సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు
తిరుపతి, కరకంబాడి రోడ్డు వద్దనున్న గోవింద దామం నందు జరుగునని తెలియజేయడమైనది.
శోకతప్త హృదయాలతో ...
కుమారుడు : గుడుపల్లి భానుప్రకాష్ రెడ్డి
తి.తి.దే. పాలకమండలి సభ్యులు, తిరుపతి | బి.జె.పి. రాష్ట్ర అధికార ప్రతినిధి
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు